# మన విశ్వం

manavishwam.com

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 99 | శుక్రవారం 25 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్



మీ కలానికి.. ఇదే వేదిక!

మన విశ్వం



జిల్లా ప్రతినిధులు

నియోజకవర్గ రిపోర్టర్లు

కావలెను

వార్త మీ బలం అయితే.. 'మన విశ్వం' మీ వేదిక!

630 563 8569

900 096 7680


# దానం ఔట్.. ఇక ఆ తొమ్మిది మంది?






- కడియం నుంచి పోచారం వరకు.. గాంధీ నుంచి మహిపాల్‌రెడ్డి వరకు ఇప్పుడు అందరి చూపు వీరిపైనే..
- బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ వైపు వెళ్లారన్న ఆరోపణలతో అనర్హత వివాదం
- దానం కేసులో సుప్రీం పరిణామంతో మిగిలిన ఎమ్మెల్యేల వ్యవహారాలపై మళ్లీ ఉత్కంఠ
- ఒక్కొక్కరి కేసులో ఏం తేలనుంది?.. దానం తీర్పు ప్రభావమెంత?



స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి | రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ | చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య | బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి | భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు | బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే | సంజయ్, జగిత్యాల ఎమ్మెల్యే | అరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే | గూడెం మహిపాల్ రెడ్డి, పఠాన్‌చెరు ఎమ్మెల్యే

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 24 (మన విశ్వం) :** దానం నాగేందర్ సంగతి తేలింది.. ఇక ఆ తొమ్మిది మంది సంగతేంటి? తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు చర్చంతా ఈ తొమ్మిది మంది ఎమ్మెల్యేల చుట్టూనే తిరుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ వైపు వెళ్లారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులోనూ ఊరట దక్కకపోవడంతో మిగిలిన తొమ్మిది మంది కేసుల్లో తదుపరి పరిణామాలేమిటన్న ఉత్కంఠ పెరిగింది. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానంగా వినిపిస్తున్న పేర్లివే. వీరంతా 2023ఎన్నికల్లో

మిగతా 2లో..

# ఖైరతాబాద్‌కు ఇక బై ఎలక్షన్!

- దానం నాగేందర్‌కు సుప్రీంలోనూ చుక్కెదురు
- హైకోర్టు అనర్హత తీర్పులో జోక్యానికి నిరాకరణ
- దానం పిటిషన్ కొట్టివేత.. ఖైరతాబాద్ స్థానం ఖాళీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులోనూ ఊరట దక్కలేదు. ఆయన అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దానం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ.. హైకోర్టు చట్టాన్ని సరిగానే అన్వయించిందని స్పష్టం చేసింది. దీంతో దానం అనర్హత కొనసాగనుండగా, ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగానే ఉండనుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం.. పదవిలో కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడాన్ని హైకోర్టు కీలకంగా పరిగణించింది. ఆయనను 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హుడిగా ప్రకటించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా జోక్యానికి నిరాకరించడంతో ఖైరతాబాద్ ఉప ఎన్నికపై రాజకీయ దృష్టి మళ్లింది.



# 22ఏలో ఉన్నా.. రిజిస్ట్రేషన్‌కు గ్రీన్‌సిగ్నల్!

- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులున్న ఆస్తులకు భారీ ఊరట
- నిషేధిత జాబితాలో ఉన్నా రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని ప్రభుత్వం ఆదేశం
- ఆమోదిత లేఅవుట్లలో నిలిచిపోయిన క్రయవిక్రయాలకు మార్గం
- ఆదేశాలు తక్షణమే అమలు.. అన్ని 22ఏ భూములకు మాత్రం వర్తించదు




**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** 22ఏ నిషేధిత జాబితాలో చిక్కుకుని రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులకు తెలంగాణ ప్రభుత్వం కీలక ఊరట కల్పించింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ నుంచి అనుమతులు పొందిన ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖకు స్పష్టం చేసింది. ఒకే సర్వే నంబర్‌లో కొంత భూమి ప్రభుత్వ లేదా ఇతర నిషేధిత కేటగిరీలో ఉండటంతో మొత్తం సర్వే నంబర్ 22ఏ జాబితాలో చేరిన సందర్భాలున్నాయి. దీంతో అదే సర్వే నంబర్‌లో అధికారిక అనుమతులతో ఏర్పాటైన లేఅవుట్లలోని ప్రైవేటు ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోయాయి. భూముల ఉపవిభజన,

మిగతా 2లో..

# మహా నిమజ్జనానికి.. భాగ్యనగరం సిద్ధం!

- నేడు ఉదయం నుంచే గణనాథుల మహా శోభాయాత్ర
- 20 వేల మందికి పైగా పోలీసులతో భారీ బందోబస్తు
- 10 వేల సీసీ కెమెరాలు.. 24 డ్రోన్లతో నిరంతర నిఘా
- మధ్యాహ్నం 12లోపే ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం లక్ష్యం
- ప్రధాన మార్గాల్లో రేపు ఉదయం వరకు ట్రాఫిక్ ఆంక్షలు



వివరాలు 2లో..



# ఎర్రవల్లి టు జన్వాడ..

## భూముల లెక్క తేల్చండి!

- కేసీఆర్, హరీశ్‌రావు కుటుంబాలు-సన్నిహితులకు సంబంధించిన భూములూ విచారణలో
- కేటీఆర్ కుటుంబ సభ్యులు, సన్నిహితుల జన్వాడ భూముల కొనుగోళ్లపైనా ఆరా
- జగదీశ్‌రెడ్డి భూములు.. గంగుల ప్రభుత్వ భూమి వ్యవహారాలూ జాబితాలో
- పల్లా భూదాన్ భూములు.. రోహిత్‌రెడ్డి అసైన్డ్ భూమిపైనా విచారణ
- మొత్తం 16 అంశాలు.. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తూ జీవో 134 జారీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** రాష్ట్రంలో వివాదాలు, అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న 16 భూ వ్యవహారాల లెక్క తేల్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక విచారణకు తెరతీసింది. ఎర్రవల్లి నుంచి జన్వాడ వరకు.. అసైన్డ్, భూదాన్, ప్రభుత్వ భూముల నుంచి ధరణి మాడ్యూల్, మిడ్‌మానేరు పరిహారం వరకు పలు అంశాలను విచారణ పరిధిలోకి తీసుకొచ్చింది. ఇందుకోసం జీవో ఎంఎస్ నం.134 జారీ చేస్తూ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లి, మర్కూక్, వెంకటాపూర్‌లో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సంబంధించిన భూములతో పాటు రామంచలో రంగనాయకసాగర్‌కు ఆనుకుని హరీశ్‌రావు

మిగతా 2లో..

# చలాన్లు కాదు.. ప్రాణాలే ముఖ్యం!

- ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం
- 'తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు-రైలు భద్రత బ్యూరో' ఏర్పాటు
- ప్రతి పోలీస్‌స్టేషన్‌లో 24 గంటలూ ప్రమాద స్పందన అధికారి
- 'గోల్డెన్ అవర్'లో క్షతగాత్రులను ఆసుపత్రికి చేర్చడమే లక్ష్యం
- హైవేలపై ప్రత్యేక పహారా.. జరిమానాల్లో 40 శాతం భద్రతకే

వివరాలు 2లో..



# థర్మల్ ప్లాంట్లలో.. బొగ్గు లెక్కల వేట!

- ఆరు బృందాలతో క్షేత్రస్థాయికి బీఆర్ఎస్
- యాదాద్రి నుంచి జైపూర్ వరకు విద్యుదుత్పత్తిపై ఆరా
- బొగ్గు ఎంత వస్తోంది?.. నిల్వలెంత?.. యూనిట్లు ఎందుకు ఆగుతున్నాయంటూ ప్రశ్నలు
- భూపాలపల్లికి రోజుకు 5 వేల టన్నులు అవసరం.. 1,500 టన్నులే వస్తున్నాయన్న నేతలు
- పలుచోట్ల అడ్డుకున్న పోలీసులు.. ప్లాంట్ల గేట్ల వద్ద ధర్నాలు



**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు సరఫరా, విద్యుదుత్పత్తిపై రాజకీయ రగడ మరింత ముదిరింది. వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు బీఆర్ఎస్ గురువారం ఆరు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. యాదాద్రి, కొత్తగూడెం, భద్రాద్రి, భూపాలపల్లి కాకతీయ, జైపూర్ థర్మల్ కేంద్రాలతో పాటు హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయానికి నేతలు వెళ్లారు. బొగ్గు నిల్వలు ఎంత?.. రోజువారీ సరఫరా ఎంత?.. పూర్తిస్థాయి ఉత్పత్తి ఎందుకు జరగడం లేదు?.. యూనిట్లు ఎందుకు నిలిచిపోతున్నాయి? అంటూ

మిగతా 2లో..

# సీఈసీ తప్పుకోవాలి.. నిజాలు బయటపెట్టాలి!

- ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాల వార్తలను ప్రస్తావించిన విపక్ష నేత
- మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలపై మళ్లీ 'ఓటు చోరీ' ఆరోపణలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకుని, ఎన్నికల వ్యవహారాలకు సంబంధించిన నిజాలను బయటపెట్టాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంలో ఓటర్ల జాబితాలకు సంబంధించిన పలు అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు

మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH


# కలలకు రెక్కలు.. కృషితోనే గమ్యం



మనిషిని ముందుకు నడిపించేది అవసరం మాత్రమే కాదు.. ఒక కల కూడా. నేడు మనం చూస్తున్న ఎన్నో ఆవిష్కరణలు, విజయాలు, సామాజిక మార్పులు ఒకప్పుడు ఎవరో కన్న కలలే. అసాధ్యమనుకున్న దానిని సాధ్యం చేయాలనే ఆలోచనే కొత్త ప్రపంచానికి పునాది వేసింది. అందుకే కలలు కనడం అంటే ఊహల్లో విహరించడం కాదు.. భవిష్యత్తుకు ఒక గమ్యాన్ని నిర్దేశించుకోవడం. సెప్టెంబర్ 25న ప్రపంచ కలల దినోత్సవం సందర్భంగా ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ముఖ్యంగా యువతకు అవకాశాలు విస్తరించిన ప్రస్తుత తరుణంలో పెద్ద లక్ష్యాలను ఎంచుకునే ధైర్యం అవసరం. సాంకేతికత ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చింది. మారుమూల గ్రామంలో ఉన్న యువకుడికీ ప్రపంచస్థాయి జ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఆన్‌లైన్ విద్య, డిజిటల్ వేదికలు, స్టార్టప్‌లు, పరిశోధన, సృజనాత్మక రంగాలు కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తున్నాయి. అయితే కల కనడం ఒక్కటే విజయానికి సరిపోదు. దానికి స్పష్టమైన లక్ష్యం, సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, నిరంతర కృషి తోడవాలి. తక్షణ ఫలితాలను ఆశించే ధోరణి పెరుగుతున్న ఈ కాలంలో ఇది మరింత గుర్తుంచుకోవాల్సిన విషయం. ఓటమి ఎదురైతే ప్రయాణం ముగిసినట్లు కాదు. తప్పులను సరిదిద్దుకుని మరోసారి ప్రయత్నించే పట్టుదలే కలను విజయంగా మార్చుతుంది. పిల్లల కలలకు కుటుంబం, విద్యాసంస్థలు అండగా నిలవాలి. వారి ఆసక్తులను ముందుగానే నిర్ణయించిన మూసల్లో బంధించడం కాకుండా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. ప్రశ్నించే స్వేచ్ఛ, కొత్తగా ఆలోచించే అవకాశం, విఫలమయ్యేందుకు కూడా భయపడని వాతావరణం కల్పించాలి. అప్పుడే ఉద్యోగాల కోసం ఎదురుచూసే యువత మాత్రమే కాకుండా అవకాశాలను సృష్టించే కొత్త తరం తయారవుతుంది. కలలు వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకూడదు. పేదరికం లేని సమాజం, అందరికీ నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, మహిళలకు సమాన అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక లక్ష్యాలూ మన సమష్టి కలలుగా మారాలి. వ్యక్తి ఎదుగుదల సమాజ పురోగతితో ముడిపడినప్పుడే ఆ విజయానికి సంపూర్ణ అర్థం ఉంటుంది. కలలు కనడానికి హద్దులు అవసరం లేదు. కానీ వాటిని నిజం చేసేందుకు కష్టపడటానికి ప్రత్యామ్నాయం లేదు. కల దిశను చూపుతుంది.. సంకల్పం అడుగు వేయిస్తుంది.. కృషి గమ్యానికి చేరుస్తుంది. ప్రపంచ కలల దినోత్సవం చెప్పే సందేశమూ ఇదే–కలలు కనండి.. వాటికి కార్యాచరణ జోడించండి. ఎందుకంటే నేటి కలలే రేపటి విజయాలకు పునాదులు.

**- నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్**

# దానం ఔట్.. ఇక ఆ తొమ్మిది మంది?

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచారు. అనంతరం కాంగ్రెస్ వైపు వెళ్లారన్న ఆరోపణలతో వీరిపై అనర్హత వివాదం మొదలైంది. దానం వ్యవహారంలో వచ్చిన తాజా న్యాయ పరిణామంతో వీరి కేసులపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది. వీరి పదవుల సంగతేంటి?

ఈ తొమ్మిది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వివాదాలు చివరకు ఎటు తిరుగుతాయన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న. దానం కేసులో కోర్టు పరిగణనలోకి తీసుకున్న అంశాలు వీరి వ్యవహారాల్లోనూ వర్తిస్తాయా? లేక ఒక్కో ఎమ్మెల్యే విషయంలో ఉన్న వాస్తవాలు, ఆధారాల ఆధారంగా వేర్వేరు నిర్ణయాలు వస్తాయా? అన్న చర్చ సాగుతోంది. దానం కేసుతో పోలిస్తే ఈ తొమ్మిది మంది వ్యవహారాల్లో కీలకమైన తేడా ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే దానం కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో నేరుగా పోటీ చేశారు. ఆ అంశం ఆయన కేసులో కీలకంగా నిలిచింది. అందువల్ల దానం విషయంలో వచ్చిన ఫలితమే తొమ్మిది మందికీ

| తొమ్మిది మంది.. తొమ్మిది నియోజకవర్గాలు! | | |
|---|---|---|
| కడియం శ్రీహరి | - | స్టేషన్ ఘన్‌పూర్ |
| తెల్లం వెంకట్రావు | - | భద్రాచలం |
| పోచారం శ్రీనివాస్‌రెడ్డి | - | బాన్సువాడ |
| డా.ఎం.సంజయ్‌కుమార్ | - | జగిత్యాల |
| అరికెపూడి గాంధీ | - | శేరిలింగంపల్లి |
| టి. ప్రకాశ్‌గౌడ్ | - | రాజేంద్రనగర్ |
| బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి | - | గద్వాల |
| గూడెం మహిపాల్‌రెడ్డి | - | పటాన్‌చెరు |
| కాలె యాదయ్య | - | చేవెళ్ల |

యథాతథంగా వస్తుందని ఇప్పుడే చెప్పలేం. తొమ్మిది నియోజకవర్గాల్లో ఉత్కంఠ స్టేషన్ ఘన్‌పూర్ నుంచి భద్రాచలం వరకు.. బాన్సువాడ నుంచి జగిత్యాల వరకు.. శేరిలింగంపల్లి నుంచి రాజేంద్రనగర్ వరకు.. గద్వాల నుంచి పటాన్‌చెరు, చేవెళ్ల వరకు ఈ వ్యవహారం రాజకీయ ఆసక్తిని రేపుతోంది. తొమ్మిది మంది ఎమ్మెల్యేల రాజకీయ భవితవ్యంతో ముడిపడిన అంశం కావడంతో తదుపరి న్యాయ పరిణామాలపై ఆయా నియోజకవర్గాల్లోనూ చూపు పడింది.

దానం తర్వాత.. నెక్స్ట్ ఎవరు?

ఇప్పుడు చర్చంతా ఇదే. దానం తర్వాత న్యాయపరంగా ముందుకు వచ్చే వ్యవహారం ఎవరిది? ఏ ఎమ్మెల్యే విషయంలో ఎలాంటి ఆధారాలు కీలకమవుతాయి? పదో షెడ్యూల్ కింద ఆయా కేసుల్లో ఏం తేలుతుంది? అన్నది ఆసక్తికరంగా మారింది. దానం వ్యవహారం ఒకవైపు తేలడంతో.. మరోవైపు 9మంది ఎమ్మెల్యేలపై ఉత్కంఠ మరింత పెరిగింది. కడియం.. తెల్లం.. పోచారం.. సంజయ్.. గాంధీ.. ప్రకాశ్‌గౌడ్.. కృష్ణమోహన్‌రెడ్డి.. మహిపాల్‌రెడ్డి.. యాదయ్య.. ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చూపంతా వీరిపైనే!

# ఎర్రవల్లి టు జన్వాడ..

## భూముల లెక్క తేల్చండి!

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సంబంధించిన భూముల అంశాలను కమిటీ పరిశీలించనుంది. వెలికట్టలో అసైన్డ్ భూమి, మల్లన్నసాగర్ భూసేకరణకు సంబంధించిన అంశాలనూ విచారణ జాబితాలో చేర్చారు.

రంగారెడ్డి జిల్లా జన్వాడలో కేటీఆర్ కుటుంబ సభ్యులు, సన్నిహితుల భూముల కొనుగోళ్లకు సంబంధించిన ఆరోపణలపైనా ఆరా తీయనున్నారు. మద్దూరులో జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు సంబంధించిన భూములు, బహదూర్‌గూడలో గంగుల కమలాకర్ తదితరులపై ప్రభుత్వ భూమి కొనుగోలు–ఆక్రమణ ఆరోపణలు, వట్టినాగులపల్లిలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులపై భూదాన్ భూముల కొనుగోలు ఆరోపణలు, అజీజ్‌నగర్‌లో పైలట్ రోహిత్‌రెడ్డిపై అసైన్డ్ భూమి కొనుగోలు–ఆక్రమణ ఆరోపణలు కూడా విచారణ పరిధిలో ఉన్నాయి. ధరణి మాడ్యూల్ దుర్వినియోగ ఆరోపణలతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్, ప్రభుత్వ భూముల వ్యవహారాలు, మిడ్‌మానేరు పరిహారం–ఆర్అండ్ఆర్ ప్యాకేజీలకు సంబంధించిన అంశాలనూ కమిటీ పరిశీలించనుంది. చట్టాలు, జీవోలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా? ప్రభుత్వ భూములకు నష్టం వాటిల్లిందా? బాధ్యులెవరు? అనే అంశాలను తేల్చి అవసరమైన చర్యలకు సిఫార్సు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. కాలేజియేట్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎ. శ్రీదేవసేన నేతృత్వంలో ప్రత్యేక కమిటీ పనిచేయనుంది.

రెవెన్యూ (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్‌తో పాటు విచారణకు సంబంధించిన ఆయా జిల్లాల కలెక్టర్లు కమిటీలో సభ్యులుగా ఉంటారు. సంబంధిత శాఖలు, జిల్లా అధికారుల నుంచి రికార్డులు, డేటా తెప్పించుకుని 16 అంశాలను పరిశీలించి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. అవసరమైతే మధ్యంతర నివేదికలు కూడా ఇవ్వనుంది.

# 22ఏలో ఉన్నా.. రిజిస్ట్రేషన్‌కు గ్రీన్‌సిగ్నల్!




(మొదటి పేజీ తరువాయి)

భూ రికార్డుల మ్యాపింగ్‌లో సమస్యలు కూడా ఇందుకు కారణమయ్యాయి. దీంతో ప్లాట్ల క్రయవిక్రయాలు, బ్యాంకు రుణాలు, ఆస్తి బదలాయింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న యజమానులకు తాజా నిర్ణయం ఊరటనివ్వనుంది. ఇటీవల అసెంబ్లీలో 22ఏ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన కార్యాచరణకు కొనసాగింపుగానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 22ఏ సమస్యల పరిష్కారానికి ప్రధాన భూపరిపాలన కమిషనర్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని కూడా ఇప్పటికే ఏర్పాటు చేసింది. అయితే 22ఏ జాబితాలో ఉన్న అన్ని భూములపై నిషేధం తొలగించినట్లు భావించకూడదు. ప్రస్తుతం ఇచ్చిన వెసులుబాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులున్న ఆస్తులకు మాత్రమే సంబంధించినది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ, అటవీ లేదా న్యాయ వివాదాల్లో ఉన్న ఇతర భూములకు ఆయా చట్టాలు, రికార్డుల ప్రకారమే నిర్ణయం ఉంటుంది. తాజా ఆదేశాలు తక్షణమే అమల్లోకి రావడంతో అధికారిక అనుమతులున్నప్పటికీ 22ఏ కారణంగా ఏళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లకు ఇప్పుడు మార్గం సుగమం కానుంది.

# సీఈసీ తప్పుకోవాలి.. నిజాలు బయటపెట్టాలి!

(మొదటి పేజీ తరువాయి)

అంతర్గతంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు.

మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల్లో 'ఓటు చోరీ' జరిగిందంటూ తాము గతంలో చేసిన ఆరోపణలను రాహుల్ మరోసారి ప్రస్తావించారు. ఇప్పుడు ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు కథనాలు రావడం కీలక పరిణామమని పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్ పరిస్థితిని అర్థం చేసుకుని దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీ ఎంపిక ప్రక్రియను ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపైనా రాహుల్ విమర్శలు చేశారు. ఎన్నికల వ్యవస్థపై తలెత్తుతున్న ప్రశ్నలకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఓటు నుంచే ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి బలం వస్తుందని.. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.

ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై చర్చ జరుగుతున్న సమయంలోనే రాహుల్ నేరుగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ఎన్నికల సంఘం వర్గాలు కమిషనర్లు అంతర్గతంగా ప్రశ్నలు, సూచనలు చేయడం నిర్ణయ ప్రక్రియలో భాగమని, తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు పేర్కొంటున్నాయి.

# మహా నిమజ్జనానికి.. భాగ్యనగరం సిద్ధం!

**నేడు ఉదయం నుంచే గణనాథుల మహా శోభాయాత్ర**

**20 వేల మందికి పైగా పోలీసులతో భారీ బందోబస్తు**

**10 వేల సీసీ కెమెరాలు.. 24 డ్రోన్లతో నిరంతర నిఘా**

**మధ్యాహ్నం 12లోపే ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం లక్ష్యం**

**ప్రధాన మార్గాల్లో రేపు ఉదయం వరకు ట్రాఫిక్ ఆంక్షలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మన విశ్వం): గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికేందుకు భాగ్యనగరం సిద్ధమైంది. శుక్రవారం జరిగే మహా గణేశ్ నిమజ్జనానికి పోలీసు, జీహెచ్ఎంసీ సహా వివిధ శాఖలు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశాయి. బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు సాగే ప్రధాన శోభాయాత్రతో పాటు నగరం నలుమూలల నుంచి వేలాది విగ్రహాలు నిమజ్జన కేంద్రాలకు తరలనున్నాయి. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అడుగడుగునా భద్రతను కట్టుదిట్టం చేశారు. నిమజ్జన బందోబస్తులో 20 వేల మందికి పైగా పోలీసులను మోహరిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన 8,142 మంది సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలను రంగంలోకి దించారు. ప్రధాన శోభాయాత్ర మార్గాలు, హుస్సేన్‌సాగర్ పరిసరాలను 10 వేలకుపైగా సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, హై–రైజ్ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 69 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్రను ఉదయం సుమారు 6 గంటలకు ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు. టెలిఫోన్ భవన్, సచివాలయం మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుని మధ్యాహ్నం 12 గంటల్లోపు హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనాలను సాధ్యమైనంత వరకు ఒక్కరోజులోనే పూర్తి చేయడంపై అధికారులు దృష్టిపెట్టారు. భారీ విగ్రహాల నిమజ్జనానికి అధిక సామర్థ్యం గల క్రేన్లను సిద్ధం చేశారు. బాలాపూర్, సికింద్రాబాద్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఊరేగింపులు ప్రధాన శోభాయాత్రలో కలవనున్నాయి.

నిమజ్జనం నేపథ్యంలో నగరంలోని ప్రధాన మార్గాల్లో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, ఖైరతాబాద్ పరిసరాల్లో సాధారణ వాహనాలను దారి మళ్లించనున్నారు. భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. భక్తుల రద్దీ, భారీ శోభాయాత్రలు, ట్రాఫిక్ మళ్లింపుల నేపథ్యంలో ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని అధికారులు కోరుతున్నారు. గణపతి బప్పా మోరియా.. మళ్లీ వచ్చే ఏడాది రా అంటూ గణనాథులకు వీడ్కోలు పలికేందుకు హైదరాబాద్ సిద్ధమైంది.

# చలాన్లు కాదు.. ప్రాణాలే ముఖ్యం!

**ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం**

**'తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు-రైలు భద్రత బ్యూరో' ఏర్పాటు**

**ప్రతి పోలీస్‌స్టేషన్‌లో 24 గంటలూ ప్రమాద స్పందన అధికారి**

**'గోల్డెన్ అవర్'లో క్షతగాత్రులను ఆసుపత్రికి చేర్చడమే లక్ష్యం**

**హైవేలపై ప్రత్యేక పహారా.. జరిమానాల్లో 40 శాతం భద్రతకే**



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (మన విశ్వం): రాష్ట్రంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణను కేవలం చలానాలు, జరిమానాలకే పరిమితం చేయకుండా.. శాస్త్రీయంగా నియంత్రించడం, ప్రమాదాలను నివారించడం, ప్రమాదం జరిగిన వెంటనే వైద్యసాయం అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు--రైలు భద్రత బ్యూరో'ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకు జీవో 135 జారీ చేసింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి పరిధిలో ఈ బ్యూరో పనిచేయనుంది. హైదరాబాద్ కేంద్రంగా అదనపు డీజీపీ లేదా ఐజీపీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారు. రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్లకు పైగా రహదారులు, 1.8 కోట్లకు పైగా వాహనాల రాకపోకలతో పాటు రోడ్డు, రైలు, మెట్రో భద్రతకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించనున్నారు.

ప్రతి స్టేషన్‌లో ప్రమాద స్పందన అధికారి

ప్రతి పోలీస్‌స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా 'రోడ్డు ప్రమాద స్పందన అధికారి'ని నియమించనున్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్పందించి క్షతగాత్రులను కీలకమైన 'గోల్డెన్ అవర్'లో ఆసుపత్రికి తరలించడం వీరి ప్రధాన బాధ్యత. ప్రమాదాలకు కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి, మళ్లీ అవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టనున్నారు.

హైవేలపై ప్రత్యేక పహారా

ఔటర్ రింగ్ రోడ్డు, ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ–రాష్ట్ర రహదారులపై ప్రత్యేక పెట్రోలింగ్ ఏర్పాటు చేయనున్నారు. 50 కిలోమీటర్లకు మించి హైవే పరిధి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక విభాగాలు పనిచేస్తాయి. వేగాన్ని గుర్తించే పరికరాలు, అత్యాధునిక కెమెరాలు, వాహన నంబర్లను స్వయంచాలకంగా గుర్తించే వ్యవస్థలు, ప్రత్యేక పెట్రోలింగ్ వాహనాలను అందుబాటులోకి తేనున్నారు.

జరిమానాల్లో 40 శాతం.. భద్రతకే

కొత్త వ్యవస్థ కోసం ప్రత్యేక 'ట్రాఫిక్ నిర్వహణ నిధి' ఏర్పాటు చేయనున్నారు. పోలీసులు వసూలు చేసే ట్రాఫిక్ జరిమానాలు, కాంపౌండింగ్ రుసుముల్లో 40 శాతాన్ని ఈ నిధికి మళ్లించనున్నారు. సిబ్బంది శిక్షణ, ఆధునిక సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు, అత్యవసర రహదారి మరమ్మతులకు ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. కొత్త బ్యూరో కోసం ఇతర పోలీసు విభాగాల నుంచి 300 పోస్టులను బదిలీ చేయనున్నారు. ప్రతి జిల్లాలో అదనపు ఎస్పీ స్థాయి ట్రాఫిక్ పోస్టు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు, ఈ--చలాన్ వ్యవస్థను కొత్త బ్యూరో పర్యవేక్షణలోకి తీసుకురానున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కేసు నమోదు చేయడమే కాకుండా.. ప్రమాదాన్ని ముందే నివారించడం నుంచి 'గోల్డెన్ అవర్'లో ప్రాణాలు కాపాడటం వరకు ఒకే వ్యవస్థ బాధ్యత తీసుకునేలా ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.

# థర్మల్ ప్లాంట్లలో.. బొగ్గు లెక్కల వేట!

(మొదటి పేజీ తరువాయి)

అధికారుల నుంచి వివరాలు కోరారు. యాదాద్రి థర్మల్ కేంద్రానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం వెళ్లింది. పూర్తిస్థాయి విద్యుదుత్పత్తి జరగడం లేదని, బొగ్గు సరఫరా సమస్యలే కారణమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. భూపాలపల్లి కాకతీయ కేంద్రానికి రోజుకు సుమారు 5 వేల టన్నుల బొగ్గు అవసరముండగా 1,500 టన్నుల మేర మాత్రమే అందుతోందని నేతలు పేర్కొన్నారు. అక్కడ బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ కేంద్రాన్ని బాల్క సుమన్ తదితరులు పరిశీలించారు. రెండు యూనిట్లలో ఒక్క యూనిట్‌లోనే ఉత్పత్తి జరుగుతోందని, పూర్తి 1,200 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరగడం లేదని ఆరోపించారు. బొగ్గు నిల్వలను పరిశీలించేందుకు తమను అనుమతించలేదన్నారు. భద్రాద్రి, కొత్తగూడెం కేంద్రాల వద్ద కూడా బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో ధర్నాలు జరిగాయి. మరో బృందం హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయానికి వెళ్లి బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, విద్యుత్ కేంద్రాలకు సరఫరాపై అధికారులను వివరాలు కోరింది. జెన్‌కో నుంచి సింగరేణికి భారీగా బకాయిలు ఉన్నాయని, వాటి ప్రభావం బొగ్గు సరఫరాపై పడుతోందని బీఆర్ఎస్ ఆరోపించింది. మరోవైపు యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. బొగ్గు సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ బృందాల పరిశీలనతో థర్మల్ కేంద్రాల్లో అసలు బొగ్గు నిల్వలెంత?.. రోజువారీ అవసరమెంత?.. ప్రస్తుతం విద్యుదుత్పత్తి ఎంత?.. ప్రభుత్వం ఈ లెక్కలను వెల్లడిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

**టేకుమట్ల.సెప్టెంబర్ 24 (మన విశ్వం)**జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పత్తి,బొగ్గు సరఫరా,యూనిట్ల పనితీరు తదితర అంశాలను పరిశీలించేందుకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు టేకుమట్ల మండలం నుండి బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు గురువారం కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ సందర్శనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.అయితే, తెల్లవారుజామునే టేకుమట్ల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ప్రజలకు సంబంధించిన విద్యుత్ సమస్యలు,విద్యుత్ ఉత్పత్తి పరిస్థితి,థర్మల్ పవర్ స్టేషన్ పనితీరును తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనకు వెళ్లకుండా నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం పై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పై ప్రశ్నించడం,సంబంధిత ప్రాంతాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని, ఇటువంటి కార్యక్రమాలను అడ్డుకోవడం



సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.ముందస్తుగా అదుపులోకి తీసుకున్న వారిలో మండల పార్టీ అధ్యక్షుడు సట్ల రవిగౌడ్,ఆది రఘు, పోతనవేన ఐలయ్య, కొలిపాక రాజయ్య, టేకుమట్ల సర్పంచ్ మాట్ల శ్రీనివాస్,టౌన్ అధ్యక్షుడు నిమ్మల స్వామి,మారం లింగారెడ్డి,గువ్వాడి లక్ష్మణ్, మహేష్,ఎండీ అక్రమ్, పోతనవేన అరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# జీతాలు పెంచండి.. లేదంటే బస్సులు బంద్!

**పెరిగిన నిత్యావసర ధరలతో ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్ల తిప్పలు**

**యాజమాన్యాలకు వినతిపత్రం.. 28న సమ్మెకు దిగుతామని హెచ్చరిక**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 (మన విశ్వం):**
పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా తమ జీతభత్యాలను పెంచాలని ఆదిలాబాద్ జిల్లా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూతనంగా ఏర్పాటైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బస్సు యజమానులకు వినతిపత్రం సమర్పించారు.ప్రస్తుత జీతాలతో కుటుంబాలను పోషించడం భారంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఎంతోమంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యతను నిర్వర్తిస్తున్నప్పటికీ, తమ శ్రమకు తగిన వేతనాలు అందడం లేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో చాలీచాలని జీతాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.తమ కష్టాన్ని గుర్తించి యాజమాన్యాలు వెంటనే జీతభత్యాల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ ఏజాస్, జనరల్ సెక్రటరీ వాహెద్, మైమద్ ఇస్రత్ అహమ్మద్‌తో పాటు యూనియన్ సభ్యులు కోరారు. తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈ నెల 28న ప్రైవేట్ బస్సులను నిలిపివేసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

# ఇలేగాం, కనకాపూర్ గ్రామాల్లో 'రెడ్ల వెంకటేష్' అలుపెరుగని సేవలు

**-రూ. 20 లక్షల సొంత నిధులతో అభివృద్ధి పనులు**
**- కనకాపూర్‌లో ఆలయాల అభివృద్ధికి రూ.15 లక్షలు ఖర్చు**
**- సొంత గ్రామం ఇలేగాంలో రూ. 5 లక్షలతో సేవా కార్యక్రమాలు**
**- బోర్ల ఏర్పాటు, మందిర కళ్యాణ మండపానికి సిమెంట్ ఫ్లోరింగ్**





**ముధోల్(భైంసా), సెప్టెంబర్ 24(మన విశ్వం):?**
నిర్మల్ జిల్లా భైంసా మండల పరిధిలోని ఇలేగాం గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, దాత రెడ్ల వెంకటేష్ (పోశెట్టి) తన సేవా గుణంతో రెండు గ్రామాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. 'సేవలో నేనున్నా' అంటూ నిరంతరం గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ, ఆర్థిక సహాయం అందించడంలో ఆయన ఎప్పుడూ ముందే ఉంటున్నారు. సొంత గ్రామం ఇలేగాంతో పాటు ప్రస్తుతం నివాసముంటున్న లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ గ్రామంలో కూడా ఇప్పటివరకు దాదాపు రూ. 20 లక్షల సొంత నిధులను ఖర్చు చేసి ప్రజల మెప్పు పొందుతున్నారు.

**కనకాపూర్ గ్రామంలో రూ. 15 లక్షలతో సేవా పథం**
ప్రస్తుతం సొంత బోర్వెల్ వాహనాన్ని నడుపుతూ లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ గ్రామంలో నివసిస్తున్న వెంకటేష్, అక్కడ పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని మందిరాల్లో సొంత ఖర్చులతో బోర్లు వేయించడంతో పాటు, భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాల్లో సిమెంట్ ఫ్లోరింగ్ పనులు చేయించారు. కనకాపూర్ గ్రామ మందిరాల అభివృద్ధి కోసం ఆయన దాదాపు 15 లక్షల రూపాయల వరకు స్వచ్ఛందంగా ఖర్చు చేసి తన ఉదారతను చాటుకున్నారు.**సొంత ఊరిపై మమకారం.. ఇలేగాంలో రూ.5 లక్షలతో సౌకర్యాలు**
మరోవైపు తన సొంత గ్రామమైన ఇలేగాం అభివృద్ధికి సైతం వెంకటేష్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఇలేగాంలో వివిధ సేవా కార్యక్రమాలకు, ఆలయాల అభివృద్ధికి దాదాపు 5 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం, మహాదేవ్ మందిరం, పోచమ్మ ఆలయాల వద్ద తన సొంత డబ్బులతో ఉచితంగా బోరు బావులు తవ్వించి, మోటర్లను కూడా అమర్చారు. అలాగే మహాదేవ్ మందిర ఆవరణలోని కళ్యాణ మండపంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా సిమెంట్ ఫ్లోరింగ్ చేయించారు.

**రూ. 11,100కు గణేష్ లడ్డూ కైవసం**
ఇటీవల ఇలేగాం గ్రామంలో జరిగిన గణేష్ నిమజ్జన మహోత్సవంలో వెంకటేష్ ఉత్సాహంగా పాల్గొన్నారు. హనుమాన్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొని, పోటీపడి మరీ రూ. 11,100కు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు వెంకటేష్‌ను ఘనంగా సన్మానించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఏ కార్యానికైనా వెనుకాడకుండా నిరుపేదలకు, గ్రామస్తులకు అండగా నిలుస్తున్న కల్మషం లేని సేవాతత్పరుడు రెడ్ల వెంకటేష్ అంటూ ఇరు గ్రామ ప్రజలు, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుంటూ కొనియాడుతున్నారు.

# సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు:జిల్లా కలెక్టర్ కె.హరిత




**కొమురం భీం, సెప్టెంబర్ 24(మన విశ్వం) :**
ప్రభుత్వ కార్యాలయాలలో విధుల పట్ల సమయపాలన పాటించని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా పౌరసరఫరాల శాఖ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్, విద్య, రహదారులు భవనాలు, ఖజానా, గిరిజన సంక్షేమ, పరిశ్రమలు, పర్యాటక, ఆడిట్, వైద్య ఆరోగ్య శాఖల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కొన్ని కార్యాలయాలలో అనుమతి లేకుండా గైర్హాజరు, కొన్ని కార్యాలయాలలో సమయపాలన పాటించని వైనాన్ని గుర్తించి సంబంధిత శాఖల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల ఖచ్చితంగా సమయపాలన పాటించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిమజ్జన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

**- సిబ్బంది నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలి**
**- సీసీ కెమెరాలతో ఆకతాయిలు, దొంగలపై ప్రత్యేక నిఘా**
**- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు**
**- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్**

**గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 24 (మన విశ్వం):**
గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు.నిమజ్జన ఏర్పాట్లను సీపీ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెల్లంపూడి చెరువు, కోకాపేట చెరువు, అమీన్‌పూర్ పరిధిలోని రాయసముద్రం లేక్, సాకి చెరువు, పటాన్‌చెరు, చందానగర్‌లోని గంగారం చెరువుతో పాటు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిమజ్జన ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జన ప్రాంతాలు, ప్రధాన మార్గాలను సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించాలని ఆదేశించారు. విద్యుత్, రెవెన్యూ, వైద్య, మునిసిపల్ తదితర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సీపీ పేర్కొన్నారు. ఆకతాయిలు, దొంగతనాలకు పాల్పడే ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రతకే అత్యంత ప్రాధాన్యమిస్తూ నిమజ్జనం పూర్తయ్యే వరకు




నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**టేకుమట్ల, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** టేకుమట్ల గ్రామానికి చెందిన తిప్పనవేని సదయ్య తల్లి తిప్పనవేని భద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను స్థానిక సర్పంచ్ మాట్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు పరామర్శించారు.మృతురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. భద్రమ్మ మృతికి సంతాపం తెలిపి, ఆమెకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నిమ్మల స్వామి, బొల్లు సరోత్తం రెడ్డి, మందల రాజేందర్ రెడ్డి, వేమ వీరయ్య పాల్గొన్నారు.

# మహనీయుడి భవనానికి మహర్దశ ఎప్పుడు?

**- రూ. 5 కోట్ల భవనం నిరుపయోగం కాకూడదు**
**- పూర్తి బాధ్యతలు ఎస్సీడీడీకే అప్పగించాలి**
**- కలెక్టర్ భవేష్ మిశ్రాకు కాంగ్రెస్, దళిత సంఘాల వినతి**



**ముధోల్ (నిర్మల్), సెప్టెంబర్ 24(మన విశ్వం):** నిర్మల్ జిల్లా కేంద్రంలో సుమారు రూ.5 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి (ఎస్సీడీడీ) కి అప్పగించి, పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు కోరారు. కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు సూచనల మేరకు గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హదీ,పూదరి అరవింద్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్,జిల్లా నాయకుడు కొంతం మురళీధర్,బుద్ధ విహార్ కమిటీ ప్రధాన కార్యదర్శి మధుకర్,మాజీ సర్పంచులు మధు, రవీందర్,రమేష్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో వ్యయంతో నిర్మించిన అంబేద్కర్ భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం వల్ల జిల్లాలోని దళిత వర్గాల ప్రజలు సేవలను పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవనంలో ప్రతిధ్వని (ఎకో) నివారణ చర్యలు చేపట్టడంతో పాటు కుర్చీలు,ఏసీ,ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని,రంగులు వేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఈ భవనంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, వెంటనే నివేదికలు పంపాలని కలెక్టర్‌ను కోరారు.

**నివేదికలు పంపాం.. బాధ్యతలు ఎస్సీడీడీకే:కలెక్టర్**

ఈ వినతిపై జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సానుకూలంగా స్పందించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇప్పటికే ఫోన్ ద్వారా దీనిపై ఆదేశాలు జారీ చేశారని కలెక్టర్ తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు గురువారం నివేదికలను ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. వినతిపత్రంలో కోరిన విధంగానే అంబేద్కర్ భవనం పూర్తి నిర్వహణ బాధ్యతలను ఎస్సీడీడీకే అప్పగిస్తామని స్పష్టం చేశారు.

# ఊరపోచమ్మ దేవాలయ నూతన కమిటీ ఎన్నిక



**టేకుమట్ల, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** మండలంలోని దుబ్యాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఊరపోచమ్మ దేవాలయ నూతన కమిటీని గ్రామ పెద్దలు,ప్రజల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ అభివృద్ధి,ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో పాటు ఆలయ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షులుగా సంగి చంద్రయ్య,ఉపాధ్యక్షులుగా గస్కంటి సంపత్,బండారి వినోద్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా సంగి సంపత్, సంయుక్త సలహాదారుగా సంగి మహేందర్, కోశాధికారిగా ధన్యం పెల్లి సతీష్ ఎన్నికయ్యారు. సాంస్కృతిక శాఖ బాధ్యతలను ఆర్ముళ్ళ రాజు,గుడి పరిశుభ్రత శాఖలో సంగి ఐలయ్య, మోరే రాములు, సలహాదారులుగా సంగి సమ్మయ్య,ప్రచారకర్తలుగా సంగి నాగేష్,ఆరుముల్ల రాజు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు దేవాలయ అభివృద్ధికి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సంగి రవి, ఆరుముల్ల బంగారి,సంగి రాజయ్య,సంగి సమ్మయ్య, సంగి లింగయ్య,సంగి శంకర్,ఆరుముల్ల వెంకటయ్య,సంగి నరసయ్య,మోరే రాజయ్య, మోరే సమ్మయ్య,గసికంటి రవి,సంగి సంపత్,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా యువ టూరిజం పోటీలు - ప్రతిభ చాటిన విద్యార్థులు



**మంచిర్యాల, సెప్టెంబర్ 24,(మన విశ్వం ):** తెలంగాణ ప్రభుత్వ పర్యాటక శాఖ, కళాశాల విద్య ఆదేశానుసారం, మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ టూరిజం క్లబ్స్ పోటీలు – 2026 అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగిశాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం – 2026 పురస్కరించుకుని యువతలో పర్యాటకంపై అవగాహన, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ ఏడాది వేడుకలను "డిజిటల్ అజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం", "ప్రమోటింగ్ హెరిటేజ్ అండ్ కమ్యూనిటీ" అనే ముఖ్యమైన ఇతివృత్తాలతో నిర్వహించారు. 'యువ టూరిజం క్లబ్'ల విద్యార్థులు ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మన స్థానిక సంస్కృతి, చారిత్రక కట్టడాల వైభవాన్ని చాటిచెబుతూ విద్యార్థులు తమ సృజనాత్మకతను, ప్రతిభను కనబరిచారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానాల్లో నిలిచి విజేతలుగా ఎంపికైన బృందాలు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి యువ టూరిజం క్లబ్స్ పోటీలలో మంచిర్యాల జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నరేందర్ రెడ్డి, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ కె రాజయ్య, కళాశాల అధ్యాపకఅధ్యాపకేతరబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఐక్యతను చాటుదాం



**టేకుమట్ల.సెప్టెంబర్ 24 (మన విశ్వం):** ఈనెల 27న యాదగిరిగుట్టలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 9వ మహాసభ పోస్టర్‌ను గురువారం టేకుమట్ల మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు బొడ్డు తిరుపతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం,సంక్షేమం కోసం ఉద్యమకారులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. మహాసభలో ఉద్యమకారుల ఐక్యతను చాటేందుకు టేకుమట్ల మండలంలోని ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో యాదగిరిగుట్టకు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జిల్లా నాయకులు కత్తి సంపత్, నేరెళ్ల రామకృష్ణ,దొడ్ల కోటేశ్వర్,జక్కుల కిరణ్, ఆది రఘు,సాదా మహేందర్,వైనాల రవీందర్, వరుదాచారి,చేపూరి రత్నాకర్,నిమ్మల స్వామి, లక్ష్మీనారాయణ, సర్వోత్తమ్ రెడ్డి,రాజయ్య,కుమార్ స్వామి,ప్రసాద్,సర్వోత్తమ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.ం

# గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికతో పనిచేయాలి

**- అర్హులందరికీ సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి**
**- గ్రామసభల్లోనే ప్రాధాన్యత పనులను గుర్తించాలి**
**- తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**
**- పింఛన్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి**
**- మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24(మన విశ్వం):** గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, పంచాయతీ నిధుల వినియోగం, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించి తీర్మానాలు చేయాలని సీతక్క సూచించారు. ప్రజలకు అత్యవసరమైన పనులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తాగునీటి ట్యాంకుల మరమ్మతులు, పైపులైన్ల ఏర్పాటు, మిషన్ భగీరథ పనులను వేగవంతం చేసి నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాలకు ఉపయోగపడే పనులను గుర్తించాలని, వాగులపై చెక్‌డ్యామ్‌లు, వ్యవసాయ కుంటలు, బోరుబావుల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో రహదారులు, సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలన్నారు. 'గ్రామాన్ని కన్నతల్లిలా భావించి పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో పనిచేయాలి' అని మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాల్లో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని శుక్రవారం నుంచి చేపట్టాలని, కార్డులు లేని అర్హులకు దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. పింఛన్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఉన్నతాధికారులకు పంపాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో బద్రు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పింఛన్ల దరఖాస్తుల వెరిఫికేషన్ నేడు



**నల్లబెల్లి, సెప్టెంబర్ 24 (మన విశ్వం):** గ్రామంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వెరిఫికేషన్ ప్రక్రియను గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ నాగెల్లి జ్యోతి--ప్రకాష్ తెలిపారు. వెరిఫికేషన్ అధికారి గ్రామానికి రానున్న నేపథ్యంలో దరఖాస్తుదారులకు సంబంధిత వార్డు సభ్యులు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. దరఖాస్తుదారులు నిర్ణీత సమయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లు, అవసరమైన పత్రాలతో అందుబాటులో ఉండాలని కోరారు. అర్హులైన వారికి పింఛన్ ప్రయోజనం చేకూరేలా చేపట్టే వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

# భోసి కర్ర వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా

**- ఆలయ కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం**
**- స్వామివారికి ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాల వితరణ**
**- ఆలయ అభివృద్ధి, భక్తుల వసతులపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**



**ముధోల్ (తానూర్), సెప్టెంబరు 24(మన విశ్వం):** మండల పరిధిలోని భోసి గ్రామంలో స్వయంభూగా వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కర్ర వరసిద్ధి వినాయకుడిని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఐఏఎస్ గురువారం నాడు దర్శించుకున్నారు. అధికారిక పర్యటనలో భాగంగా గ్రామానికి విచ్చేసిన కలెక్టర్‌కు ఆలయ అర్చకులు,పూర్ణకుంభంతో.. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, సర్పంచ్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు.

**ప్రత్యేక పూజలు – వేద ఆశీర్వచనాలు**

ఆలయంలో ప్రవేశించిన అనంతరం కలెక్టర్ భవేష్ మిశ్రా స్వామివారి మూలవిరాట్టును దర్శించుకుని కర్పూర హారతి ఇచ్చారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ, జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రంగమండపంలో అర్చకులు వేద మంత్రోచ్చారణలతో కలెక్టర్‌కు ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి, స్వామివారి గణపతి ప్రతిమను జ్ఞాపికగా బహూకరించి ఘనంగా సత్కరించారు.

**వసతులు, అభివృద్ధి పనులపై సమీక్ష**

పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఏటా ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆలయ నిర్వహణ తీరును, భక్తులకు కల్పిస్తున్న కనీస సదుపాయాలను ఆలయ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పండుగలు, ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, వసతి సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తానూర్ మండల రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,పోలీసు సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల వాలంటీర్స్ కి దక్కిన అరుదైన గుర్తింపు



**మంచిర్యాల, సెప్టెంబర్ 24(మన విశ్వం ):** 2017-18 గాను రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత ను మంచిర్యాల జిల్లా కన్వీనర్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ కి అవార్డు ని అందజేశారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం లో జాతీయ సేవాపథకం స్వర్ణోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కే. ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. గత సంవత్సరం రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొన్న వాలంటీర్స్ కి అవకాశం కల్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి మంచిర్యాల జిల్లా కేంద్రం లో ఉన్న వివేకవర్ధిని డిగ్రీ కళాశాల వాలంటీర్స్ కి పాల్గొనే అవకాశం దక్కింది. వాలంటీర్స్ తెలంగాణ సంప్రదాయ పండుగ అయిన బోనాల పండుగ పాటకి చక్కటి డాన్స్ తో అలరించారు. తెలంగాణ సంప్రదాయ పండుగను కళ్ళకు కట్టినట్లు చూపించిన వాలంటీర్ ని వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి,రిజిస్ట్రార్ రామచంద్రం అభినందించారు. ఈ కార్యక్రమం లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రో. వి రామచంద్రం , మాజీ కోఆర్డినేటర్ ప్రో. జ్యోతి , ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రో. ఈసం నారాయణ, వివేకవర్ధిని ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ అధికారి షరీనా , వాలంటీర్స్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్ ఎస్ ఎస్ దినోత్సవ వేడుకలు




**మంచిర్యాల, సెప్టెంబర్ 24(మన విశ్వం ):**
మంచిర్యాలప్రభుత్వ డిగ్రీ కళాశాల లో గురువారం ఎన్ ఎస్ ఎస్ యూనిట్ వన్, టు ఆధ్వర్యంలో ఎన్ ఎస్ ఎస్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఎన్ఎస్ఎస్ ద్వారా యువత సమాజసేవ అలవర్చుకోవాలని తెలిపారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొనాలని, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎన్ ఎస్ ఎస్ తోడ్పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం కుమారస్వామి, డాక్టర్ కే రాజయ్య, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్టుకు శివాజీ మహారాజ్ పేరు పెట్టాలి

**రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఆరే సంక్షేమ సంఘం విజ్ఞప్తి**

**'ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం**

**--వరంగల్'గా నామకరణం చేయాలని డిమాండ్**



**నర్సంపేట,సెప్టెంబర్ 24(మన విశ్వం):**
వరంగల్ మామునూరు విమానాశ్రయానికి ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరు పెట్టాలని ఆరే సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన శాఖకు విజ్ఞప్తి చేసినట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుసుంబ రఘుపతి తెలిపారు.
ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, పరిపాలనా దక్షత, ప్రజా సంక్షేమం, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన వరంగల్‌లోని విమానాశ్రయా నికి ఆయన పేరు పెట్టడం సముచితమని అభిప్రాయపడ్డారు.మామునూరు విమానాశ్రయం అభివృద్ధితో ఉత్తర తెలంగాణకు విమాన కనెక్టివిటీ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విమానాశ్రయానికి 'ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం--వరంగల్'గా నామకరణం చేయాలని కుసుంబ రఘుపతి కోరారు.

# నిర్మల్‌లో భూముల రీ-సర్వేను వేగవంతం చేయాలి: కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశం



**ముధోల్ (నిర్మల్ కలెక్టరేట్), సెప్టెంబర్ 24(మన విశ్వం):**
నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి,నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రీ-సర్వే పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన ఒక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలను, గ్రామాలవారీగా సాధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూసుకోవా లని,సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు.భూ రికార్డుల ప్రక్షాళనలో రీ-సర్వే అత్యంత కీలకమైనదని, అధికారులుసమన్వయంతో పనిచేసి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారులు,సర్వే ల్యాండ్ రికార్డ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం: ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ముధోల్(కుంటాల), సెప్టెంబర్ 24 (మన విశ్వం):** అణచివేతకు వ్యతిరేకంగా, ప్రజల హక్కుల కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కొనియాడారు.నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఆమె జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ఈ డిమాండ్లను తాను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ,ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల బీమా చెక్కు పంపిణీ చేసిన అంబేకర్ సాయిరాం



**ముధోల్,సెప్టెంబర్ 24(మన విశ్వం):** మండల పరిధిలోని ముద్గల్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా (గ్రూా×ూా) చెక్కును అందజేసినట్లు బిద్రెల్లి పీఏసీఎస్ చైర్మన్ అంబేకర్ సాయిరాం తెలిపారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన రమ్మయి మహిపాల్ కుటుంబానికి ప్రభుత్వం నుండి మంజూరైన బీమా పరిహారానికి సంబంధించిన చెక్కును నామిని రమ్మయి అక్షయకు చైర్మన్ అంబేకర్ సాయిరాం,బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ పాటిల్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ భూమయ్య,సూపర్ వైజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.ద

# బాసరలో విషాదం: నిమజ్జనానికి వచ్చి గోదావరిలో మునిగి యువకుడి దుర్మరణం



**ముధోల్(బాసర), సెప్టెంబరు 24(మన విశ్వం):** నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.వినాయక నిమజ్జనం కోసం వచ్చి ప్రమాదవశాత్తు గోదావరి నదిలో మునిగి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తానూర్ మండలం ఎల్వి గ్రామానికి చెందిన లోకండే విశాల్ (20) అనే యువకుడు గురువారం వినాయక నిమజ్జనం నిమిత్తం బాసరలోని గోదావరి నదికి వచ్చాడు.గణపతి నిమజ్జనం పూర్తయిన అనంతరం, నదిలో స్నానం చేయడానికి అతడు నీటిలోకి దిగాడు.అయితే నదిలో లోతును గమనించకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు.ఈ ప్రమాదంలో విశాల్ నదిలోనే శ్వాస విడిచి మృతి చెందినట్లు బాసర ఎస్‌హెచ్ఓ దీపక్ తెలిపారు.మృతుడి తల్లి కమలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# 'రెవెన్యూ'పై పనిభారం..

**ఆసిఫాబాద్, సెప్టెంబరు 24 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షే మ, అభివృద్ధి కార్యక్రమాల వరుసతో రెవెన్యూ శాఖ అధికారులపై పనిభారం రోజురోజుకూ పేరుకపో తోంది. ఏడాదిన్నర కాలంగా కొత్త పథకాలు, ప్రత్యేక సర్వేలు, భూ సంబంధిత కార్యక్రమాలు, క్షేత్రస్థాయి తనిఖీలు, నిరంతర సమీక్షలతో అధికారులు విశ్రాం తి లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఒక కార్యక్రమం పూర్తి కాకముందే మరో కార్యక్రమం ప్రారంభం కావడంతో రెవెన్యూ యంత్రాంగం ఊపి రి సలపని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు అధికారు లు వాపోతున్నారు.

– బహుముఖ పనుల్లోనూ..

రెవెనూ శాఖ ప్రస్తుతం కేవలం దైనందిన పరి పాలనకే పరిమితం కాకుండా ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న బహుముఖ పనుల్లో కీలక పాత్ర పోషిస్తోంది. సాదాబైనామా దరఖాస్తుల పరి శీలన, రెవెన్యూ సదసుస్సల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, భూ భారతి దరఖాస్తుల నమోదు, ప్రస్తుతం అత్యంత ప్రాదాన్యతగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కాగా, తాజాగా భూ రీసర్వే ప్రారంభమైంది. వీటికితోడు ప్రజాప్రతినిధుల పర్యటనల ఏర్పాట్లు, ఉన్నతాధికారుల ఆకస్మిక తని ఖీలు, నిరంతరాయంగా ప్రత్యేక నివేదికల సమర్పణ లో బిజీగా విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అంతే కాకుండా వీటితో పాటు విద్యార్థుల సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్లు, భూ తగాదాలు వంటి కార్యక్రమాలే కాకుండా ప్రస్తుతం 22ఏ నిషేధిత భూముల సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

– రెండు రెవెన్యూ డివిజన్లలో..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో రెండు రెవెన్యూ డివిజన్లలో 15 తహసీల్దార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో 400మందికి పైగా అధికార, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఏడాదిన్నర కాలంగా తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా అధికారులు శారీరక, మానసిక, అనా రోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలనే ఒత్తిడి పెరిగిందని, నిద్రలేమి, తీవ్ర మానసిక ఆందోళన, రక్తపోటు వంటి సమస్యలు పెరిగిపోతు న్నాయని అధికారుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలున్నా సెలవు తీసుకోకుండా విధులకు హాజరు కావాల్సి వస్తోందని చెబుతున్నారు.

– తీరిక లేని పనులతో..నిరంతర విధులతో తమ వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా కోల్పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. పిల్లల చదువులు, వారి అవసరాలను పట్టించుకునే తీరిక దొరకడం లేదని ఆరోపిస్తున్నారు. బంధువుల శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలకు హాజరై నెలలు గడుస్తుందని అధికారులు చెబుతున్నారు. కుటుంబ సభ్యులు కూడా మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9గంటలకే కార్యాలయానికి చేరుకుంటే రాత్రి 11దాటినా విధులు ముగియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఎవరి నుంచి ఫోన్ వస్తుందో ఏ సమస్యపై తక్షణ మే నివేదిక ఇవ్వాల్సి వస్తుందో తెలియని ఆందోళ నలో బతుకుతున్నామని వాపోతున్నారు. సమీక్షలు, కాన్ఫరెన్స్‌లతో సగం సమయం అయిపోతుందని పలువురు అధికారులు ఆవేదన చెందుతున్నారు. దీంతో కుటుంబాలకు దూరంగా ∩ కూడా మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9గంటలకే కార్యాలయానికి చేరుకుంటే రాత్రి 11దాటినా విధులు ముగియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఎవరి నుంచి ఫోన్ వస్తుందో ఏ సమస్యపై తక్షణ మే నివేదిక ఇవ్వాల్సి వస్తుందో తెలియడపాల్సిన పరిస్థి తులు ఉన్నాయంటూ వాపోతున్నారు. సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లను రాత్రివేళల్లో కాకుండా నిర్ణీత కార్యాలయ వేళల్లోనే ముగించాలని కోరుతున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరత తీర్చాలని కోరుతున్నారు. అన్ని రకా ల సర్వేలు, పథకాల బాధ్యతలను కేవలం రెవె న్యూ పైనే కాకుండా పలు శాఖలను భాగస్వామ్యం చే యాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మైనర్ బాలికను రక్షించిన శశికుమార్‌కు సీపీ సన్మానం

**సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారిని కాపాడిన శశికుమార్‌కు అభినందనలు**



**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్**
మైనర్ బాలికను ప్రమాదం నుంచి రక్షించి, నిందితుడిని పోలీసులకు అప్పగించిన శశికుమార్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్ అభినందించి సన్మానించారు.ఆగస్టు 16న రెండేళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి నుంచి శశికుమార్ ధైర్యంగా చిన్నారిని రక్షించారు. మార్గంలో వెళ్తున్న సమయంలో బాలిక అరుపులు వినిపించడంతో వెంటనే స్పందించిన శశికుమార్ అక్కడికి చేరుకుని చిన్నారిని సురక్షితంగా కాపాడటంతో పాటు నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.ఈ సందర్భంగా సీపీ డాక్టర్ ఎం. రమేశ్ శశికుమార్‌ను గంగారం చెరువు వద్దకు పిలిపించి శాలువాతో సత్కరించారు. సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారిని రక్షించిన శశికుమార్‌ను అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా స్పందిస్తూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని సీపీ పేర్కొన్నారు.శశికుమార్ చూపిన ధైర్యం, మానవత్వం అభినందనీయమని, ఆయన చూపిన చొరవ ఇతరులకు స్ఫూర్తిదాయకమని సీపీ డాక్టర్ ఎం. రమేశ్ తెలిపారు.

# రూ.1,75,000 లకు లడ్డుని గెలుచుకున్న కాకతీయ స్కూల్ డైరెక్టర్ తిరుపతి రావు




**కూకట్పల్లి.ప్రతినిధి శ్రవణ్ కుమార్ సెప్టెంబర్ 24** కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లోని కాకతీయ స్కూల్ డైరెక్టర్ పెండ్యాల తిరుపతి రావు వినాయక చవితి ఉత్సవాల్లో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొని రూ.1,75,000/-లకు లడ్డూను దక్కించుకున్నారు.భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూను దక్కించుకున్న పెండ్యాల తిరుపతి రావు కి నిర్వాహకులు, భక్తులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా తిరుపతి రావు మాట్లాడుతూ, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన పూజారికి హెల్మెట్ అందజేత

**రోడ్డు భద్రతపై తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసుల అవగాహన**



**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 24**
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా స్పందించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న సాయిబాబా పూజారి నిరంజన్ పాండేకు ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు హెల్మెట్ అందజేశారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని అవగాహన కల్పించారు.హెల్మెట్ ధరించడం కేవలం నిబంధన పాటించడం మాత్రమే కాదని, ప్రమాదాల సమయంలో ప్రాణ రక్షణకు కీలకమని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వాహనదారులు స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి రహదారి భద్రతకు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా నిరంజన్ పాండేకు హెల్మెట్ అందజేసి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసుల చర్యను పలువురు అభినందించారు.

# ఖైరతాబాద్ బడా గణేశ్ - 72 ఏళ్ల అరుదైన రూపాలు ఇవే!

**హైదరాబాద్ :** మహానగరంలో ఖైరతాబాద్ గణేశ్ అంటే తెలియని వారు ఉండరు. నవరాత్రుల పాటు గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఎక్కడా లేని విధంగా ఖైరతాబాద్ మహా గణపతి ప్రతి ఏడాది ఒక ప్రత్యేక అవతారంలో భక్తులందరికీ ప్రత్యేక సందేశమిస్తూ దర్శనమిస్తాడు. ఈ ఏడాది పంచముఖ సంకట హర మహాగణపతిగా ఖైరతాబాద్ గణనాథుడు భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రధాన వినాయకుడితో పాటు సోమనాథ జ్యోతిర్లింగం, కాళికా మాతను ఏర్పాటు చేశారు. ప్రపంచంలో జరుగుతున్న అన్ని సంకటాలు తొలిగి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఈ ఏడాది పంచముఖేశుడిగా ఖైరతాబాద్ మహా గణపతిగా దర్శనమిచ్చారు.ప్రతిరోజూ లక్షకు పైగా మంది భక్తులు ఈ గణనాథుడిని దర్శించుకుంటారు. వీకెండ్స్?లో ఈ రద్దీ రెట్టింపవుతుంది. అయితే మహాగణపతికి ఈ ఏడాదితో 72 ఏళ్లు పూర్తి. 1954లో తొలిసారిగా ఒక్క అడుగుతో ప్రారంభమైన ఖైరతాబాద్ గణపతి నేడు 72 ఏళ్లు పూర్తి చేసుకుని 69 అడుగుల మహా గణపతిగా నిలిచాడు. మొదటి నుంచి ఎత్తుతో, ప్రత్యేక మైన సందేశంతో ఓ ప్రత్యేక అవతారంలో దర్శనమివ్వడం ఈ లంబోదరుడు ప్రత్యేకత.ఈ ఏడాది ఖైరతాబాద్ గణనాథుడు 72 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 69 అడుగుల మట్టి గణపతిని ప్రతిష్టించారు. విగ్రహ తయారీ పనులు మూడు నెలల ముందు కర్రపూజతో ప్రారంభించారు. ముందుగా భారీ విగ్రహానికి అంతర్గత నిర్మాణాన్ని సిద్ధం చేశారు. స్టీల్ రాడ్లు, మెష్, కలపతో కూడిన సపోర్టింగ్ నిర్మాణంతో గణేశుడి ఆకృతికి పునాది వేశారు. ఆ తర్వాత ఎండిన వరి గడ్డిని పొరలుగా అమర్చి దానిపై మట్టి, ఇసుక మిశ్రమాన్ని పూస్తూ ఒక్కో అవయవానికి రూపం ఇచ్చారురాజస్థాన్‌లోని బనాస్ నది ప్రాంతం నుంచి తెచ్చిన సుమారు 30 టన్నుల సహజ నది మట్టిని హైదరాబాద్‌లో లభించే 20 టన్నుల ఇసుకతో కలిపి వినియోగించారు. మట్టి మిశ్రమంతో తొండం, చెవులు, కిరీటం,



చేతులు, ముఖాలకు తుది ఆకృతి ఇచ్చారు. చివరి దశలో 25 మందికిపైగా చిత్రకారులు మూడు రోజుల పాటు నిరంతరాయంగా పనిచేశారు. నీటి ఆధారిత, సేంద్రియ రంగులతో విగ్రహానికి తుది మెరుగులు దిద్ది పంచముఖ గణపతి రూపుదిద్దుకున్నాడు. నవరాత్రుల పాటు భక్తులకు దర్శనమిచ్చిన ఈ 69 అడుగుల మహాగణపతి వెనుక మూడు నెలల ప్రణాళిక 150 మందికిపైగా కళాకారుల శ్రమ పలు రాష్ట్రాల నైపుణ్యం దాగి ఉంది. బాలగంగాధర్ తిలక్ ప్రేరణతో ఖైరతాబాద్?లో గణేశ్ విగ్రహ.బాలగంగాధర్ తిలక్ ప్రేరణతో సింగరి శంకరయ్య 1954లో ఖైరతాబాద్‌లోని ఆలయంలో 1 అడుగు గణేష్ విగ్రహాన్ని మొదటిసారిగా స్థాపించారు. ఆ తర్వాత 2014 వరకు ప్రతి సంవత్సరం విగ్రహం ఎత్తు ఒక్కో అడుగు పెంచుకుంటూ వెళ్లారు. 2014లో విగ్రహం ఎత్తు 60 అడుగులకు పెంచారు. ఆ తర్వాత 2018 వరకు ఒక్కో అడుగు తగ్గించుకుంటూ వచ్చారు. 2018లో 57 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని నిర్మించారు. కోవిడ్ కారణంగా 2020లో 9 అడుగుల ఎత్తుతో ఒక చిన్న విగ్రహం మాత్రమే ఏర్పాటు చేశారు. హుస్సేన్?సాగర్?కు వెళ్లే మార్గం పరిమితుల కారణంగా 2021లో విగ్రహం 40 అడుగులకి పరిమితం చేశారు. ఆ తర్వాత 2022లో 50 అడుగులు, 2023లో 63 అడుగులు, 2024లో 70 అడుగులు 2025,26 లో 69 అడుగులకు పెంచారు. ఈ ఏడాది కూడా గతేడాది లాగే 69 అడుగుల ఎత్తులో మట్టి గణపతిని ఏర్పాటు ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనంగణేశ్ చతుర్థి సెప్టెంబర్ 14 నుంచి ఖైరతాబాద్ గణేశుడి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఏటా లక్షలాది మంది గణపయ్యను దర్శించుకుంటారు. ఈ ఏడాది కూడా గతేళ్ల లాగానే 20 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మొదటి నుంచే ప్రభుత్వం, కమిటీ సమన్వయంతో అన్ని రకాలు భద్రతా ఏర్పాట్లు చేశారు.

# 'బీఆర్‌ఎస్ పార్టీకి ఇదొక గొప్ప విజయం.. మిగతా ఎమ్మెల్యేలు కూడా..'

**హైదరాబాద్ :** దానం నాగేందర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ ఇవ్వకుండా అడ్మిషన్ స్టేజీలోనే కొట్టివేయడం జరిగిందని బీఆర్‌ఎస్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపు కేసులో తనను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. దానం నాగేందర్‌పై అనర్హత వేసిన సుప్రీంకోర్టు.. మళ్లీ



ఎన్నికలకు వెళ్లాలని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో న్యాయవాది గండ్ర మోహన్ రావు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. నువ్వొకసారి వేరే పార్టీ నుంచి పోటీ చేసిన తర్వాత మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీగా నీకు అనర్హత చట్టం వరిస్తుందని గౌరవ సుప్రీంకోర్టు చెప్పింది. కాబట్టి దాని తర్వాత జరిగిన పరిణామాలతో సంబంధం లేదని గౌరవ సుప్రీంకోర్టు కొట్టేసింది. వారి కౌన్సిల్ వాదించడానికి ప్రయత్నం చేశారు. బీఆర్‌ఎస్ నాపై చర్యలు తీసుకోలేదు. నేనింకా బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నా కాబట్టి నాకు ఇంకా అనర్హత వర్తించదని అన్నారు.దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన 3 రోజుల్లోనే స్పీకర్ దగ్గర బీఆర్‌ఎస్ పిటిషన్ దాఖలు చేసిందని చెప్పా. కానీ స్పీకర్ వద్ద నుంచి సరైన స్పందన రాకపోవడంతో, హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు బీఆర్‌ఎస్ న్యాయపోరాటం చేసిందన్నారు. దీంతో త్వరలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి. బీఆర్‌ఎస్ మొదటి రోజు నుంచి న్యాయపోరాటం చేసింది. బీఆర్‌ఎస్ పార్టీకి ఇదొక గొప్ప విజయం. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల విషయంలో కూడా డివిజన్ బెంచ్ ఒక నిర్ణయం తీసుకోబోతుంది. వారికి కూడా ఇలాగే జరగబోతుందని ఆశిస్తున్నామన్నారు.

# కేటీపీఎస్ వద్ద ఉద్రిక్తత.. బీఆర్‌ఎస్ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 24 :** బొగ్గు సరఫరా లేక విద్యుత్ ప్లాంట్లు వెలవెలబోతున్నాయంటూ బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వర్‌రావు బృందం గురువారం పాల్వంచ కేటీపీఎస్ సందర్శనకు వెళ్లింది. ఈ సందర్శనలో గేటు వద్దనే బీఆర్‌ఎస్ బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. సుమారు గంటసేపు తోపులాట జరిగింది. పలువురు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో కేవలం




బృందంలోని ఐదుగురిని మాత్రమే ప్లాంట్‌లోకి అనుమతించారు. అనంతరం గేటు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ వద్దిరాజు మాట్లాడారు. చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదన్నారు. రైతాంగం నిర్వేదంతో, బాధల్లో ఉన్నారని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి సాగునీళ్లు, విత్తనాలు, కరెంట్,యూరియా సక్రమంగా సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు.

# మరోసారి భీమ్‌రెడ్డి ఆస్తులపై ఏసీబీ సోదాలు - రూ.1.40 కోట్ల నగదు గుర్తింపు

మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీ ఇళ్లలో ఏసీబీ మరోసారి సోదాలు చేపట్టింది. పుప్పాలగూడతో సహా మొత్తం 8 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. పుప్పాలగూడలో భీమ్‌రెడ్డి బినామీ కోమటి వెంకటేశ్ ఇంట్లో ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి. కోమటి వెంకటేశ్ ఇంట్లో రూ.1.40 కోట్ల నగదు అధికారులు గుర్తించారు. నగదుపై ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఏసీబీ సమాచారం ఇచ్చింది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి.విల్లా ఎలా కొన్నారు?భీమ్‌రెడ్డికి సంబంధించిన కన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్ కంపెనీలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. భీమ్‌రెడ్డి ప్రస్తుతం నివసిస్తున్న విల్లా కొనుగోలు పైనా ఏసీబీ ఆరాతీస్తోంది. మద్యం సీసాల వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించింది. భీమ్‌రెడ్డి రూ.9 కోట్లకు విల్లా కొనుగోలు చేసినట్లు గుర్తించారు. విల్లా కొనుగోలుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులుబినామీల పేర్లతో ఆస్తులు, నగదు లావాదేవీలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంపై గతంలో భీమ్‌రెడ్డిని ఏసీబీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. భీమ్‌రెడ్డి రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టారని



గతంలో అధికారులు గుర్తించారు.పలు ప్రాంతాల్లో భారీగా బినామీ ఆస్తులుభీమ్‌రెడ్డి విధి నిర్వహణలో ఉండగా అక్రమ మార్గాల్లో దాదాపు రూ.150 కోట్ల విలువైన ఆస్తులను సంపాదించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు బినామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు కల్గి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భీమ్‌రెడ్డి సంపాదించిన ఈ భారీ అస్తులు కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తేల్చారు. మణికొండ, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోలు, మోమిన్‌పేట్, జహీరాబాద్, కర్ణాటకలోని బెంగళూరులోనూ ఖరీదైన ఆస్తులను గుర్తించారు. ఈ ఆస్తుల్లో సింహభాగం నేరుగా ఆయన పేరు మీద కాకుండా బినామీల పేర్లపై కొనుగోలు చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఏసీబీ దర్యాప్తులో భారీగా బినామీ ఆస్తులు బయటపడటంతో ఈ అంశంపై ఈడీ దృష్టిసారించింది. అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన మనీలాండరింగ్ ఏ విధంగా మళ్లించారనే కోణంలో ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

# జేఎన్‌టీయూ హాస్టళ్లలో భద్రత డొల్ల!

**హైదరాబాద్ :** జేఎన్‌టీయూ హాస్టళ్లలో భద్రతా లోపాలున్నాయని పోలీసులు స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 3, 4 తేదీల్లో రెండు వర్గాలకు చెందిన విద్యార్థులు పరస్పరం భౌతిక దాడులకు దిగడం, యూనివర్సిటీ లోపల, వెలుపల వాతావరణం రణరంగంగా మారడంపై కూకట్‌పల్లి జోన్ పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించారు.సుమారు 36మంది విద్యార్థులపై కేసులు నమోదు కావడంతో.. సమగ్ర విచారణ అనంతరం విద్యార్థుల భద్రతకు సంబంధించి యాజమాన్యానికి కీలకమైన సూచనలు చేస్తూ కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రితిరాజ్ లేఖ రాశారు. సెప్టెంబరు 3, 4తేదీల మధ్య అర్ధరాత్రి సమయంలో 4 వేర్వేరు సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆయా ఘటనలను పరిశీలిస్తే విశ్వవిద్యాలయం వైపు నుంచి



లోపాలు కనిపించాయని పేర్కొన్నారుఅంత జరిగినా అడ్డుకున్న వారేలేరు..ఒక విద్యార్థి మంజీరా హాస్టల్ గది తలుపును పగులగొట్టి లోపల ఉన్న విద్యార్థులపై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, అక్కడ హాస్టల్ వార్డెన్ కానీ, సెక్యూరిటీ సిబ్బంది కానీ ఎవరూ అందుబాటులో లేరు. సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు ఇదే పరిస్థితి కొనసాగినప్పటికీ, పరిస్థితిని అదుపు చేయడానికి విశ్వవిద్యాలయం నుంచి ఎవరూ ముందుకు రాలేదు. వార్డెన్‌గా నియమితులైన అధికారి యూనివర్సిటీ క్యాంపస్‌కు చాలా దూరంలో నివసిస్తున్నట్లు తెలిసింది.మొదటి సంఘటన హాస్టల్ సమీపంలోనే బహిరంగ ప్రదేశంలో జరిగినా ఎటువంటి సీసీ ఫుటేజ్ లభించలేదు. గతంలో జరిగిన అనేక సంఘటనలను పరిష్కరించడంలో యూనివర్సిటీ యంత్రాంగం వైఫల్యం చెందడం వల్లే ప్రస్తుత సంఘటన తీవ్రరూపం దాల్చింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని డీసీపీ కోరారు.భద్రత కోసం పోలీసుల సూచనలివీ..సెప్టెంబర్ 3, 4 తేదీల మధ్య అర్ధరాత్రి విద్యార్థుల దురుసు ప్రవర్తనను ఎదుర్కోవడంలో ప్రస్తుత ఏజెన్సీ విఫలమైనందున, ఈ సమస్యను పరిష్కరించగల సామర్థ్యం ఉన్న, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ రెగ్యులేషన్ యాక్ట్ 2005 కింద లైసెన్స్ పొందిన సెక్యూరిటీ ఏజెన్సీని నియమించాలి. హాస్టళ్లకు వార్డెన్‌ల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వార్డెన్ హాస్టల్‌లోనే ఉంటూ, ఏదైనా సమస్య తలెత్తినప్పుడు తక్షణమే అందుబాటులో ఉండాలి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా స్పందించడానికి, హాస్టళ్ల, ప్రధాన గేటు సమీపంలో తగినంత సెక్యూరిటీ గార్డులను నియమించాలి.కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) సూచించిన విధంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థులను అర్థం చేసుకోగల, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత పరిపాలనా అధికారుల దృష్టికి తీసుకురాగల అర్హత కలిగిన కౌన్సిలర్లను తగినంత మందిని నియమించాలి. భద్రతా చర్యల అమలుకు సంబంధించి ఎస్‌హెచ్‌ఓతో సమన్వయం కోసం లైజన్ ఆఫీసర్‌ను నియమిస్తే మేలు. ఇలా చేస్తే భవిష్యత్తులో ఏవైనా ఘటనలు జరిగితే సకాలంలో స్పందించడానికి వీలవుతుందని పోలీసులు సూచించారు.

## ఏవియేషన్ రంగంలో తెలంగాణ యువతకు లక్కీ ఛాన్స్!

**హైదరాబాద్,** తెలంగాణ విద్యార్థులకు విమానయాన రంగంలో అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, అత్యుత్తమ శిక్షణ కల్పించే లక్ష్యంతో సాంకేతిక విద్యాశాఖ కీలక అడుగు వేసింది. హైదరాబాద్ పాత ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న 'తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ' తో సాంకేతిక విద్యా శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు డా. కే. కేశవ రావు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.సమగ్ర శిక్షణ: జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ మూడేళ్ల



డిప్లొమా ప్రోగ్రామ్ చదువుతున్న విద్యా ర్థులకు పరిశ్రమ అవసరాలకు తగినట్లుగా ప్రత్యక్ష శిక్షణ ఇస్తారుథియరీ, ప్రాక్టికల్స్: విద్యార్థులకు తరగతి గది థియరీతో పాటు ల్యాబ్ ప్రాక్టికల్స్, ఆధునిక ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్‌పై ప్రత్యక్ష ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ కల్పిస్తారు.2,100 గంటల ఇండస్ట్రియల్ ట్రైనింగ్: డిప్లొమా చివరి ఏడాదిలో భాగంగా లో ఏడాది పాటు దాదాపు 2,100 గంటల నిడివితో ప్రత్యక్ష ప్రాక్టికల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ పొందే అవకాశం కల్పిస్తున్నారు.భద్రతా ప్రమాణాలు: విమానాల నిర్వహణలో ఏవియేషన్ సేఫ్టీ, సెక్యూరిటీ ప్రమాణాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. ఈ శిక్షణ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ) నిబంధనలకు అనుగుణంగా సాగుతుంది.ఉపాధి అవకాశాలు: ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రముఖ ఎయిర్‌లైన్స్, ఎంఆర్‌ఓలు, ఏరోస్పేస్ రంగాంశాలతో నేరుగా అనుసంధానం ఏర్పడుతుందిఐదేళ్ల కాలపరిమితి: సాంకేతిక విద్యాశాఖ - మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 90 శాతం హాజరుతో పాటు ఉత్తమ పనితీరు ప్రమాణాలు కనబరిచిన విద్యార్థులకు ప్రాక్టికల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ అందజేస్తారు.

# 'వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలతోనే సమగ్రాభివృద్ధి'

**చుంచుపల్లి, సెప్టెంబర్ 24 :** గ్రామ పంచాయతీల వాస్తవ అవసరాలు, స్థానిక వనరులను గుర్తించి పక్కా ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టినప్పుడే గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) విద్యా చందన అన్నారు. ఎస్.కె. నగర్ కమ్మ సత్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,



సిబ్బందికి వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు--పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో విద్యా చందన మాట్లాడుతూ... 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యానికి అనుగుణంగా గ్రామాల సమగ్రాభివృద్ధికి పంచాయతీ స్థాయిలో పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గతంలో 317 రకాల పనులకు అవకాశం ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 375కు పెరిగిందని తెలిపారు. అదేవిధంగా 100 రోజులు పని పది దినాలను 125 రోజులుగా పెంచారని తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.మూడు ప్రధాన విభాగాల్లో అభివృద్ధి పనులువికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో ప్రధానంగా మూడు విభాగాలకు ప్రాధాన్యం ఉంటుందని డీఆర్‌డీవో వివరించారు.మొదటిది -- నీటి భద్రత : నీటి సంరక్షణ, నీటిని నిల్వ చేసుకునే చర్యలు, నీటి కుంటల ఏర్పాటు తదితర పనులు చేపట్టాలన్నారు.రెండవది -- గ్రామీణ మౌలిక వసతులు : పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, పశువైద్య మౌలిక వసతులు తదితర అవసరమైన నిర్మాణాలను ప్రణాళికలో చేర్చాలని సూచించారు.

# వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ'.. ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!

**వరంగల్:** ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్లు ఖరారు ప్రభుత్వ నిర్ణయానికి త్వరలో కేబినెట్ ఆమోదముద్ర ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి చరిత్ర ఉట్టిపడేలా కొత్త డిజైన్లు రూపొందించాలని ఆదేశం వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ రాణి రుద్రమదేవి పేరు, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు ఆదివాసీ యోధుడు కొమురం భీం పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు ఫైలును కేబినెట్ సమావేశం ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ పేర్లపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల



పేర్లు పెట్టిన తరహాలోనే, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వీరుల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే, ఈ పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ పంపనున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే, మామునూరు ఎయిర్‌పోర్టుకు సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.
డిజైన్లపై సీఎం అసంతృప్తిఇదే సమీక్షలో విమానాశ్రయాల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికారులు చూపిన డిజైన్లను చూసి "ఇవి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) డిజైన్లా? లేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చేసినవా?" అని ప్రశ్నించినట్లు తెలిసింది. విమానాశ్రయాల నిర్మాణం అద్భుతంగా, తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఉట్టిపడేలా ఉండాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎం సూచనల మేరకు అధికారులు ఇప్పుడు కొత్త డిజైన్లను సిద్ధం చేసే పనిలో పడ్డారు. త్వరలోనే తుది డిజైన్లను మళ్లీ సీఎంకు సమర్పించనున్నారు.

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక
శుక్రవారం,
సెప్టెంబర్ 25, 2026


# అండర్-15 ఆసియాకప్ పోటీలకు వరంగల్ క్రీడాకారిణి ఎంపిక



హనుమకొండ చౌరస్తా : అండర్-15 ఆసియాకప్ పోటీల్లో ఇండియన్ సాఫ్ట్‌బాల్ జట్టులో ఆడేందుకు వరంగల్ క్రీడాకారిణి వేల్పుల సాయివర్షిని ఎంపిక అయ్యింది. చైనాలో అక్టోబర్ 12 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న 5వ అండర్-15 ఉమెన్స్?? సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొననుందని హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శ్వేతను మర్యాదపూర్వకంగా కలవడంతో ఆమె క్రీడాకారిణిని అభినందించారు. సీపీ మాట్లాడుతూ ఇండియన్ టీంకు సాయివర్షిని ఎంపిక కావడం అభినందనీయమని కొనియాడారు. సాయివర్షినినీ క్రీడాకారిణిగా ఎదిగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ పోలేపాక వినయ్ , సాయివర్షిని తండ్రి అనిల్, అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్ ఉన్నారు.

# మిక్స్‌డ్ రీలేలో రజతం.. మారథాన్‌లో సీమకు చరిత్రాత్మక కాంస్యం..!

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. ఐదో రోజు షూటర్లు వెండి వెలుగులు విరజిమ్మగా.. అథ్లెట్లు కూడా పోడియంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. పది వేల మీటర్ల పరుగులో సీమా కుమారి కంచు మోత మోగించింది. సీమ కాంస్యం అందుకున్న ఇరవై నిమిషాల్లోనే మిక్స్‌డ్ రీలే(4ఐ400 మీటర్ల) ఫైనల్లో భారత బృందం రజతం ఒడిసిపట్టింది. ఫలితంగా భారత్ ఖాతాలో 17 పతకాలు చేరాయి. జపాన్‌లోని నగోయలో జరుగుతున్న పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకపోరులో దూసుకెళ్తున్నారు. మిక్స్‌డ్ రీలే (4ఐ400 మీటర్ల) విభాగంలో . మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో పూవమ్మ రాజు, విశాల్ థెన్నరసు, విథ్యా రామరాజు, మను టీఎస్‌లు రెండో స్థానంతో రజతం గెలుపొందారు. గురువారం ఫైనల్లో.. విథ్యా, విశాల్ చిరుతలా పరుగెత్తారు. వీరి కృషి ఫలితంగా ఈ టోర్నీలో తమ రికార్డును కాపాడుకుంది మిక్స్‌డ్ రీలే బృందం. ఇదివరకు 2018లో స్వర్ణం, 2022 ఎడిషన్‌లో భారత టీమ్ రజతం గెలుపొందింది.





# పాకిస్థాన్‌తో ఆఖరి ఓవర్ థ్రిల్లర్.. ఆ ఉద్విగ్న క్షణాలకు 19 ఏళ్లు..!



పురుషుల టీ20 ప్రపంచకప్‌ను ఒకటి కాదు ఏకంగా మూడుసార్లు ముద్దాడింది భారత జట్టు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవడం చిన్న విషయమేమీ కాదు. కానీ, అప్పుడప్పుడే పొట్టి క్రికెట్ వైపు అడుగులు పడుతున్న వేళ 'మెన్ ఇన్ బ్లూ' తొలిసారి ఈ ఐసీసీ ట్రోఫీని అందుకున్న క్షణాలు ఎప్పటికీ చిరస్మరణీయమే. తొలిసారి నిర్వహించిన ఈ మెగా టోర్నీలో జులపాల ఎంఎస్ ధోనీ సారథ్యంలోని టీమిండియా అబ్బురపరిచే ఆటతో కప్‌ను ఒడిసిపట్టింది. అది కూడా ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో పాకిస్థాన్‌ను ఓడించి. టీమిండియా, ధోనీ ఘనతల్లో కలకాలం నిలిచిపోయిన ఈ మొట్టమొదటి పొట్టి వరల్డ్‌కప్ విజయానికి సరిగ్గా నేటితో 26 ఏళ్లు. క్రికెట్‌లో ఇప్పుడు టీ20లదే హవా. బ్యాటర్ల వీరకొట్టుడు, ఉత్కంఠ పోరాటాలు, ఆఖరి ఓవర్ థ్రిల్లర్.. అబ్బో ఈ ఆట ఇచ్చే కిక్కే వేరు. అయితే.. 2007లోనే క్రికెట్ ప్రియులకు అసలు సిసలైన టీ20 మజాను పంచింది టీమిండియా. ఆ ఏడాది ఐసీసీ తొలిసారిగా ప్రవేశపెట్టిన పొట్టి వరల్డ్‌కప్‌ను సంచలన ఆటతో లేని ధోనీ సారథ్యంలోని భారత జట్టు గెలుపొందింది. సెమీస్‌కు ముందు ఇంగ్లండ్‌పై యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లతో చరిత్ర సృష్టించగా.. పాకిస్థాన్‌తో ఫైనల్ మరింత థ్రిల్‌నిచ్చింది. నరాలు తెగే ఉత్కంఠ రేపిన ఫైనల్లో జోగిందర్ శర్మ వేసిన ఆఖరి ఓవర్‌ను, శ్రీశాంత్ పట్టిన సూపర్ క్యాచ్‌ను భారత అభిమానులు ఎప్పటికీ మర్చిపోలేరు.



# భారత్‌లో ఫుట్‌బాల్ సంస్కృతి లేదు.. మమల్ని ఎదుర్కొనే అనుభవమూ లేదు..!

ఫిఫా వర్డ్‌కప్ వేళ టీవీలకు అర్ధ రాత్రిళ్లు మేల్కొని టీవీలకు అతుక్కున్న భారతీయులు స్వదేశంలో బ్రెజిల్‌తో మ్యాచ్‌కోసం కోటి కళ్లతో ఎదురు చూస్తున్నారు. మాజీ ఛాంపియన్ అయిన ఈ దక్షిణ అమెరికా జట్టుతో ఫ్రెండ్లీ పోరు తమకు బోల్డెంత కిక్ ఇస్తుందని అనుకుంటున్నారు. విదేశీ స్టార్లను ప్రత్యక్షంగా చూసే రోజు సమీపిస్తుండగా బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలొట్టి సంచలన వ్యాఖ్యాలు చేశాడు. కోల్‌కతాలో అక్టోబర్ 3న జరుగనున్న మ్యాచ్‌ను ఉద్దేశించి గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. భారత్‌లో ఫుట్‌బాల్ సంస్కృతి లేదని అన్నాడు. సాకర్‌లో మనదేశం వెనకబడడానికి గల కారణాలను, కొత్తతరం ఆటగాళ్ల కోసం కీలక సూచనలు చేశాడు. భారత్, బ్రెజిల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు గడువు దగ్గరపడుతోంది. అక్టోబర్ 3వ తేదీన కోల్‌కతాలో ఇరుజట్లు ఫ్రెండ్లీగా తలపడనున్నాయి. ఈ బిగ్ మ్యాచ్ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలొట్టి త్వరలోనే భారత్ రానున్నాడు. కోల్‌కతాను చూసేందుకు ఆతృతగా ఉన్నానని పేర్కొన్న కార్లో.. భారత్‌లో ఫుట్‌బాల్ సంస్కృతి లేదంటున్నాడు. బ్రిస్బేన్‌లో మీడియాతో మాట్లాడిన కార్లో బ్రెజిల్‌లో అంతులేనంతగా ఫుట్‌బాల్ సంస్కృతి ఉందని చెప్పాడు. కానీ, ప్రపంచ స్థాయి జట్లను ఎదుర్కొనేంత అనుభవం టీమిండియాకు లేదని ఆయన కుండబద్ధలు కొట్టేశాడు.

# ముంబై ఇండియన్స్ గూటికి ఆర్సీబీ కోచ్.. మనోడి ట్రాక్ రికార్డు తెలుసా..!



ఫ్రాంచైజీ క్రికెట్‌లో అదరగొడుతున్న ముంబై ఇండియన్స్‌కు కొత్త హెడ్‌కోచ్ వచ్చేశాడు. మహిళల ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ ముంబై తదుపరి కోచ్‌గా ల్యూక్ విలియమ్స్ నియమితులయ్యాడు. కీట్లే లీసా స్థానంలో ఈ ఆస్ట్రేలియా దిగ్గజం త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నాడు. మహిళల క్రికెట్‌పై లోతైన అవగాహన, సుదీర్ఘ కోచింగ్ అనుభవమున్న విలియమ్స్ తమ జట్టును విజయవంతం చేస్తాడని ముంబై యాజమాన్యం భావిస్తోంది. కొత్త కోచ్‌గా అతడి నియామకాన్ని గురువారం ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ ప్రకటించింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ ఐదో సీజన్‌లో కొత్త కోచ్ మార్గనిర్దేశనంలో ఆడనుంది. కీట్లే లీసా స్థానంలో ల్యూక్ విలియమ్స్ ముంబై హెడ్‌కోచ్‌గా నియమితులయ్యాడు. డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీ తొలిసారి ట్రోఫీని ముద్దాడడంలో కీలకమైన విలియమ్స్ ఇకపై ముంబై విజయాల్లో భాగం కానున్నాడు. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లోనూ అతడు స్ట్రయికర్స్ జట్టును వరసగా రెండుసార్లు (2022, 2023) ఛాంపియన్‌గా నిలిపాడు.

# బీసీసీఐతో దోస్తీ.. టీమిండియా టైటిల్ స్పాన్సర్‌గా 'ముత్తూట్ ఫిన్‌కార్ప్'..!



ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ పంట పండనుంది. బంగారంపై రుణాలతో అందరికీ చేరువైన ఈ సంస్థ భారత క్రికెట్ నియంత్రణ మండలితో దోస్తీకి సిద్ధమైంది. పలు సంస్థలను వెనక్కి నెట్టి భారత జట్టు టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు దక్కించుకుందీ సంస్థ. వచ్చే రెండేళ్ల పాటు టీమిండియా జెర్సీలపై ముత్తూట్ పేరు తళుక్కుమననుంది. 'బ్లూ ముత్తూట్' పేరుతో టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుందీ కంపెనీ. అయితే.. స్వదేశంలో టీమిండియా ఆడే మ్యాచ్‌లకు మాత్రమే పరిమితం కానుందని సమాచారం. క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. ప్రస్తుతం ద్వైపాక్షిక సిరీస్‌లో భారత జట్టు టైటిల్ స్పాన్సర్‌గా కంపా, ఎస్‌బీఐ లైఫ్, చాట్‌జీపీటీలు ఉన్నాయి. ఇప్పుడు వీటి సరసన ముత్తూట్ ఫిన్‌కార్ప్ కూడా చేరనుంది. రెండేళ్ల కాలానికి బీసీసీఐతో ముత్తూట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అంటే.. 2028 మార్చి 31 వరకూ ఈ హోదాలో కొనసాగనుందీ కొచ్చికి చెందిన ఫైనాన్స్ కంపెనీ. అయితే.. ఈ విషయాన్ని బీసీసీఐ అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్.. కొరియాపై భారత్ విక్టరీ



టోక్యో: ఆసియా క్రీడల హాకీ ఈవెంట్‌లో ఇండియా దుమ్మురేపుతోంది. పూల్ ఏ నుంచి భారత జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇవాళ దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా 8-2 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత స్ట్రయికర్ దిల్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దిల్‌ప్రీత్‌తో పాటు అభిషేక్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, రాజిందర్ సింగ్ కూడా గోల్స్ చేశారు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే తొలిసారి దక్షిణ కొరియాపై ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇండియా పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ విక్టరీతో ప్రస్తుతం పూల్ ఏ స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు జపాన్‌తో భారత్ తలపడనున్నది.

# మిక్స్‌డ్ టీమ్ స్కీట్‌లో కాంస్యం గెలిచిన అనంత్ జీత్, పరినాజ్



న్యూఢిల్లీ: జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో ఇండియాకు మరో పతకం వచ్చింది. షూటింగ్‌కు చెందిన మిక్స్‌డ్ టీమ్ స్కీట్ ఈవెంట్‌లో భారత జోడి అనంత్ జీత్ సింగ్ నరూకా, పరినాజ్ ధలీవాల్.. పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆ బృందానికి కాంస్య పతకం వచ్చింది. ఫైనల్ రౌండ్‌లో ఇండియన్ జోడి 44 పాయింట్లు స్కోరు చేసి మూడవ స్థానంలో నిలిచింది. ఆరు సిరీస్‌ల గేమ్‌లో ఇద్దరూ మెరుగైన ప్రదర్శన ఇచ్చారు. ఓపెనింగ్ సిరీస్‌లో 14, 21, 29, 36 స్కోరు చేసిన ఆ జంట ఓ దశలో ఏడో స్థానంలో ఉన్నది. కానీ చివరి రౌండ్‌లో 44 పాయింట్లు స్కోరు చేసి బ్రాంజ్ పతకాన్ని సొంతం చేసుకున్నారు. 138 సగటు స్కోరుతో అనంత్ జీత్, పరినాజ్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో నాలుగో స్థానంలో నిలిచారు. దీంతో ఆసియా క్రీడల్లో షూటింగ్ విభాగంలో భారత పతకాల సంఖ్య 8కి చేరింది. షూటింగ్ ఈవెంట్‌లో ఇండియాకు నాలుగు సిల్వర్, నాలుగు బ్రాంజ్ మెడల్స్ దక్కాయి.

# ‘జార్జ్ క్రిష్’ కథానాయిక..

దర్శకుడు శ్రీను వైట్లతో హీరో శర్వానంద్ తొలిసారి సినిమా చేస్తున్నారు. వీరి కాంబోలో ‘జార్జ్ క్రిష్’ సినిమా పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించనుంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ‘కపుల్ ఫ్రెండ్లీ’ తో సూపర్ హిట్ అందుకున్న మానస వారణాసి ఇందులో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.





# విడుదల తేదీ వాయిదా

హీరో వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న వినోదాత్మక చిత్రం ‘ఆదర్శ కుటుంబం -- ఏకే47’ విడుదల తేదీ మారింది. తొలుత ప్రకటించిన తేదీ కంటే వారం ఆలస్యంగా, ఈ చిత్రాన్ని అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. వినోదం, కుటుంబ భావోద్వేగాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు.

## ‘పారడైజ్’ సినిమా.. కేసీఆర్ పాత్రలో ఆకట్టుకున్న ప్రియదర్శి



హైదరాబాద్ : నాని హీరోగా నటించిన ‘ది ప్యారడైజ్’ సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ డ్రామా ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ సందడి చేస్తోంది. ముఖ్యంగా ప్రియదర్శి పోషించిన ఎమ్మెల్యే శంకర్ పాత్రపై చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో ప్రియదర్శి తెలంగాణ రాజకీయ నాయకుడిని పోలిన గెటప్‌లో కనిపించినట్లు అభిమానులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆయన హావభావాలు, మాటతీరు, తెలంగాణ యాస ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.కొన్ని సన్నివేశాల్లో మాజీ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలినట్లు అనిపిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కేసీఆర్ ప్రసంగాల్లో కనిపించే శైలి, బాడీ లాంగ్వేజ్‌ను గుర్తు చేసేలా ప్రియదర్శి నటన ఉందంటూ అభిమానులు పోస్టులు చేస్తున్నారు. సినిమాలో ఆయన పాత్ర ఎలా సాగుతుంది? ఎలాంటి సన్నివేశాల్లో కనిపిస్తారు? అన్నది తెరపై చూడాల్సిందే. అయితే సినిమా విడుదలైన వెంటనే ప్రియదర్శి పాత్రకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.



## ‘ఆ రోజు నాకు రెండో జీవితం దక్కింది’.. ఐదేళ్ల క్రితం ప్రమాదాన్ని గుర్తుచేసుకున్న సాయి దుర్గా తేజ్

మెగా హీరో సాయి దుర్గా తేజ్ జీవితంలో 2021 సెప్టెంబర్ నెలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండి చికిత్స తీసుకున్నారు. ప్రమాదం నుంచి క్రమంగా కోలుకుని మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. ఇప్పుడు ఆ ప్రమాదం జరిగి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సాయి దుర్గా తేజ్ చేసిన భావోద్వేగ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఐదేళ్ల క్రితం ఇదే రోజున తనకు జీవితంలో రెండో అవకాశం లభించిందని సాయి దుర్గా తేజ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు అందించిన అండ తన కోలుకునే ప్రయాణంలో ఎంతో కీలకంగా నిలిచిందని చెప్పారు. వారి ప్రేమ, ప్రార్థనలు, సందేశాలు తనకు కష్టమైన రోజుల్లో ముందుకు సాగేందుకు బలాన్ని ఇచ్చాయని గుర్తుచేసుకున్నారు.ప్రమాదంలో ఎదురైన గాయాల నుంచి తాను దాదాపు 90 శాతం వరకు కోలుకున్నానని సాయి దుర్గా తేజ్ తెలిపారు. అయితే మాటతీరు సహా కొన్ని విషయాల్లో ఇంకా పూర్తిగా మెరుగుపడేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రతిరోజూ ఒక్కో అడుగు ముందుకు వేస్తూ కోలుకుంటున్నానని పేర్కొన్నారు. కష్టమైన ప్రతి రోజు, ఎదురుదెబ్బ తగిలిన ప్రతి సందర్భం, వదిలేయడం సులభంగా అనిపించిన ప్రతి క్షణంలోనూ మీ ప్రేమే నాకు బలాన్ని ఇచ్చింది. ఐదేళ్ల తర్వాత కూడా నేను నిలబడి ఉన్నాను. పోరాడుతున్నాను.

# ‘కర్ణ’గా రాఘవ లారెన్స్

పెన్ మూవీస్ అధినేత జయంతి లాల్ గడా సమర్పణలో.. ఆర్‌వీ స్టూడియోస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్ అసోసియేషన్‌లో.. దర్శకుడు రమేష్ వర్మ నుంచి ఐదు భాషల్లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ఎపిక్ ‘కర్ణ’. మహాభారతంలోని మహా వీరుడు కర్ణుడి మహాగాథ మరో సారి ఆవిష్కృతం కానుంది. ఈ మహా యోధుడి పాత్రలో నటుడు రాఘవ లారెన్స్ నటిస్తున్నారు. దర్శకుడు రమేష్ వర్మ తనదైన విజన్‌తో ఈ పురాణగాథను భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. రూ.150 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో రూపొందుతోంది. ఐదు భాషల్లో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక ఎపిక్.. అత్యున్నత నిర్మాణ విలువలు, భారీ సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఓ సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది. భారీ సెట్స్, అద్భుతమైన వరల్డ్ డిజైన్స్, భారీ



యాక్షన్ సన్నివేశాలు, అత్యున్నత స్థాయి వీఎఫ్‌ఎక్స్‌తో ‘కర్ణ’ ప్రపంచాన్ని ఇంతకు ముందెన్నడూ చూడని స్థాయిలో ఆవిష్కరి స్తున్నారు. మహాభారత కాలం నాటి రాజ్యాలు, యుద్ధభూ ములు, భారీ యుద్ధ సన్నివేశాలు.. ఇలా ప్రతి అంశాన్ని అత్యంత గ్రాండ్‌గా రూపొంది స్తున్నారు. నిజమైన సెట్స్ వైభవానికి అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌ను జోడిస్తూ.. ప్రేక్షకులను కర్ణుడి ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569